## నగరంలో 'క్యూబిక్' స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

వస్త్ర ఉత్పత్తులకు సంబంధించిన 'క్యూబిక్' స్టోర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త పింకీ రెడ్డి ప్రారంభించారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌కు సినీనటి శోభితా ధూళిపాళ వచ్చి సందడి చేశారు. సంప్రదాయం, ఆధునికతకు ఈ స్టోర్ అద్దం పడుతుందని పింకీ రెడ్డి అన్నారు. నాణ్యమైన వస్త్రాలను, సరసమైన ధరలకు వినియోగదారులకు అందించాలని కోరారు. ఇది తమకు రెండో స్టోర్ అని క్యూబిక్ యజమాని గురీందర్ సింగ్ తెలిపారు.

## ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై ఎఫ్‌టిసిసిఐ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ :ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) ఇంటరాక్టివ్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పలువురు స్పీకర్లు, ఇన్వెస్టర్లు హాజరయ్యారు. వ్యవసాయం కలప, వస్త్రాలు, జీడిపప్పు, పండ్లు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, ఖనిజాలు, గాజు, నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విభిన్న రంగాలలో ఆఫ్రికాలో వ్యాపార అవకాశాలపై నిపుణులు వివరించారు. అరైజ్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ ఎపి అండ్ తెలంగాణ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ ఎకె ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. ఆఫ్రికాలోని వ్యాపార అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవా లో వివరించారు. ఆఫ్రికా నుంచి యూరప్‌కు పన్నులు లేకుండా ఎగుమతులు చేసే విధానాలను తెలిపారు. అధిక రాబడులకు ఇదో మంచి అవకాశమన్నారు.

## ఇంటర్ ప్రవేశాల గడువు జులై 31

- రెండో విడత షెడ్యూల్ విడుదల
- ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును వచ్చేనెల 31వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు రెండో విడత షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా శనివారం విడుదల చేశారు. మొదటి ప్రవేశాల గడువు ఆదివారంతో ముగియనున్న విషయం తెలిసిందే. దీంతో వచ్చేనెల 31 వరకు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పొందాలని అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే చేరాలని విద్యార్థులు, తల్లిదండ్రులను ఆ కాలేజీల జాబితాను acadtsbie.cgg. gov. in లేదా tgbie.cgg. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేరొద్దని సూచించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కాలేజీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమైన తెలిసిందే.

## కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్‌కు నిరసన

- బిజెపి రాష్ట్ర కార్యాలయం ముట్టడికి ఆప్ యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సిబిఐ అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆప్ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, జెండాలు చేతబూని బిజెపి ఆఫీసు వైపునకు మెరుపు వేగంతో దూసుకొచ్చారు. ప్రధాని మోడీ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేసి కార్యాలయం వైపు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆప్ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కోటేశ్వరరావుకు తంగిరాల క్రిష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుఖమంచి కోటేశ్వరరావుకు 25వ తంగిరాల క్రిష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు తంగిరాల ట్రస్టు చైర్మన్ కవి తంగిరాల చక్రవర్తి శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పురస్కారాన్ని జులై 21న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఆ కార్యక్రమానికి మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, 25 మంది సాహితీవేత్తలకు, కళాకారులకు సత్కారం ఉంటుందని తంగిరాల పేర్కొన్నారు. సుఖమంచి నాటకాలు రాసి, వేశారనీ, సినిమాలకు సంభాషణలు రాశారని తెలిపారు. సినిమాలు కూడా తీస్తున్న ఆయన డబుల్ పిజి చేశారని, వామపక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారని తంగిరాల చెప్పారు.

# హెరిటేజ్ సిటీగా వరంగల్

- ప్రత్యేక జోన్‌గా టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- ఉమ్మడి జిల్లాపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరాన్ని హెరిటేజ్ సిటీగా.. హైదరాబాద్‌కు సమాంతరంగా అభివృద్ధి చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం హన్మకొండ కలెక్టరేట్‌లో వరంగల్ నగరాభివృద్ధిపై సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. 8 అంశాలపై 3 గంటలపాటు సమీక్ష నిర్వహించారు. రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మామునూరు ఎయిర్‌పోర్ట్, కాళోజీ కళాక్షేత్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై 20 రోజులకోమారు సమీక్షా సమావేశం నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో వరంగల్ నగరాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాక 45 రోజుల్లోపు మళ్లీ పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలందించాలన్నారు. జాతీయ రహదారికి కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు వుండాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు కనెక్టివిటీ వుండేలా రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. వర్షాలు పడ్డప్పుడు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మళ్లీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కాళోజీ కళాక్షేత్రం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ మాస్టర్‌ప్లాన్ 2050 వరకు డిజైన్ చేయాలన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం భూ సేకరణ చేపట్టాలని ఆదేశించారు. తాగునీరు లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. నాలాల ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. రింగు రోడ్డు నిర్మాణంపై హన్మకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రెండు దశల్లో 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగు రోడ్డు నిర్మాణానికి మొదట సత్వరమే భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాతే నిర్మాణ పనులు చేయాలన్నారు.

**నగరాభివృద్ధికి రూ.6,115 కోట్లు అవసరం..**

వరంగల్ నగరాభివృద్ధికి రూ.6,115 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్టు సిఎం చెప్పారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లను మహిళా సంఘాలే తయారు చేసేలా బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. వరంగల్ నగర ముంపుకు శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. నాలాల్లో పూడికను ఎప్పటికప్పుడూ తొలగించాలని చెప్పారు. హైదరాబాద్‌లో చేపడుతున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలుంటే వెంటనే తొలగించాలన్నారు. నీలోఫర్ ఆస్పత్రి లాగా ఇక్కడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్లు, వైద్యసేవలకు సంబంధించి 'నిమ్స్'లో ఎన్‌ఒసిలు ఇచ్చినట్టుగానే ఎంజిఎం ఆస్పత్రిలోనూ ఎన్‌ఓసీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా ఏర్పాటు చేయాలన్నారు.

**సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం పూర్తి**

హన్మకొండలో నిర్మిస్తున్న కాళోజీ కళా క్షేత్రాన్ని సెప్టెంబర్ 9వ తేదీ నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. ఈ పనులకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు.

**రూ.518.71 కోట్ల చెక్కుల పంపిణీ**

స్వశక్తి మహిళలకు రూ.518.71 కోట్ల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిణీ చేశారు. సమీక్షా సమావేశానికి ముందు హన్మకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, చీఫ్ సెక్రటరీ శాంతికుమార్, డీజీపీ రవి గుప్తా, విప్ డాక్టర్ రామచంద్రునాయక్, మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డి, వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

## బిజెపి ఎంపి డికె అరుణ ఇంటి ముట్టడి

- విద్యార్థి సంఘాల ఆందోళన
- నీట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ విషయంలో నిర్లక్ష్య ధోరణి నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ బిజెపి ఎంపి డికె అరుణ ఇంటి ముట్టడి కార్యక్రమం చేపట్టారు. పద్మావతి కాలనీ పెట్రోల్ బంక్ నుంచి విద్యార్థి సంఘాల నాయకులు ర్యాలీగా డికె అరుణ ఇంటి ముట్టడికి బయలుదేరడంతో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ బిజెపి నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి ఒకటో పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షపై పార్లమెంటులో ఎంపి డికె అరుణ మాట్లాడాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన విషయమని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విద్యార్థుల గురించి ఆలోచించడంలేదని విమర్శించారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి మళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీలో బిజెపి నేతల హస్తం ఉందని ఎన్‌టిఎను రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు.

## నిష్పాక్షికతంగా విచారణ జరపాలి

- జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మా రాజకీయ ప్రత్యర్థులు చేసిన వాదనలతో మీరు ఏకీభవిస్తున్నట్టు మీ మాటల్లో స్పష్టమైంది. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు" ఛత్తీస్‌గఢ్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణంపై విచారణ కోసం ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఏకసభ్య కమిషన్‌కు మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జీజగదీశ్‌రెడ్డి రాసిన లేఖలోని సారాంశం ఇది. విచారణ పూర్తికాకముందే విలేకరుల సమావేశం నిర్వహించడం సంప్రదాయాలకు విరుద్ధం అంటూ ఆ లేఖలో కమిషన్‌పై విరుచుకుపడ్డారు. ఇప్పటి వరకు జరిపిన విచారణలో వచ్చిన అంశాలకు వివరణ ఇవ్వాలని రెండోసారి కమిషన్ ఆయనకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి ఆయన శనివారం 8 పేజీల సుదీర్ఘ వివరణను కమిషన్‌కు పంపారు. గతంలో కెసిఆర్ కమిషన్‌కు రాసిన అంశాలు, అభ్యంతరాలనే మాజీ మంత్రి కూడా లేఖలో ప్రస్తావించారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందం రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిందనీ, విచారణ కమిషన్ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌తో పాటు అక్కడి అధికారుల్ని కూడా విచారించాలని లేఖలో కోరారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర సంస్థల ఉన్నతాధికారుల్ని కూడా విచారణ జరపాలనీ, అప్పుడు సమగ్ర విచారణ జరిగినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఏదో నష్టంజరిగిపోయింది...ఇక లెక్క గట్టడమే తరువాయి అన్నట్టు ఉన్న కమిషన్ వ్యాఖ్యలతో పత్రికల్లో రూ.6 వేల కోట్ల నష్టం అంటూ వార్తలు రావడాన్ని ఆయన తప్పు పట్టారు. రాష్ట్ర విభజన, ఆనాటి విద్యుత్‌రంగ పరిస్థితులు, ఆంధ్రప్రదేశ్‌తో కరెంటు పంచాయతీ, కరెంటు కోతలు, రైతుల ఇక్కట్లు, పారిశ్రామికవేత్తల అవస్థలు అన్నింటినీ తీసుకొని, అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నామని ఆ లేఖలో వివరణ ఇచ్చారు. తామెక్కడా ఉద్దేశపూర్వకంగా ఎలాంటి తప్పులు చేయలేదనీ, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేశామన్నారు. కమిషన్ ఎదుట ఇప్పుడు ఎవరైతే అభ్యంతరాలు లేవనెత్తారో... వారంతా విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ముందు కూడా ఇవే అభ్యంతరాలు లేవనెత్తారనీ, అసెంబ్లీలోనూ ఇవే అంశాలను ప్రస్తావిస్తే, వాటికి అక్కడే పూర్తిస్థాయి వివరణలు ఇచ్చామని స్పష్టం చేశారు. ఇదే తరహాలో మాజీ సీఎం కెసిఆర్‌కు కూడా కమిషన్ రెండోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వాటిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తీర్పు సోమవారం వెల్లడికానుంది.

## సింగరేణికి బొగ్గు బావులు వచ్చే విధంగా ఒత్తిడి చేయండి

- సిఎండికి సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణికే బొగ్గు బావులు వచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు సిఐటియు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సిఐటయు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, యూనియన్ నాయకులు బాలాజీ, రాములు ఎమ్‌డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 21న దేశ వ్యాప్తంగా 61 బొగ్గు బావులను వేలం వేసేందుకు ప్రక్రియను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇందులో సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను కూడా వేలంలో పెట్టారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా కార్మికులు పోరాడుతున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణికి శ్రావణపల్లి బ్లాక్ కేటాయించే విధంగా ఒత్తిడి తీసుకొని రావాలని వారు విజ్ఞప్తి చేశారు. మినరల్, మైన్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ చట్టంలో సెక్షన్ 17 ఏ ప్రకారం కేంద్రం బొగ్గు బావులను రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు తేవకాశం ఉందని గుర్తు చేశారు. రానున్న 10 ఏండ్లలో సగం సింగరేణి బొగ్గు బావులు మూతపడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి కొత్త బావులు సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ప్రతి ఏడాది రూ.8వేల కోట్లను వివిధ రూపాల్లో చెల్లిస్తుందని తెలిపారు. ఇలాంటి సంస్థను ప్రయివేట్ వారికి అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు. సింగరేణికి జేన్ కో, ట్రాన్స్ కో నుంచి రూ. 30వేల కోట్లు బకాయిలున్నాయనీ, వాటిని రాబట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడుతూ..కేంద్ర గనుల శాఖ మంత్రికి బొగ్గు బావులు సింగరేణికి కేటాయించాలని ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో బొగ్గు బ్లాకులను ప్రయివేట్ వారికి ఇవ్వటం వలన నష్టపోయమని గుర్తు చేశారు. కోయగూడెం, సత్తుపల్లి, బ్లాకులను పొందలేక పోయామని తెలిపారు. కేంద్రం సింగరేణికి కేటాయిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను కేటాయించేవరకు అన్ని సంఘాలతో పోరాడతామని యూనియన్ నాయకులు తెలిపారు.

# శ్రామికులతోనే అభివృద్ధి

- పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలి
- తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలి
- ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

సెమినార్‌లో మాట్లాడుతున్న నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరాలు ధనికులకే కాదు శ్రామికులకు కూడా అని.. వారు లేకుండా అభివృద్ధి లేదని.. పేదలు నివసించే ప్రాంతాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో 'నగరీకరణ-ప్రభుత్వ విధానాలు-ప్రత్యామ్నాయాలు' అంశంపై శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన నగరాలు అంటే ధనికులు మాత్రమే నివసించే విధంగా తయారయ్యాయన్నారు. ఒక నగరం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే విధంగా అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉండాలని, పేద ధనిక తేడా లేకుండా అభివృద్ధి చేయాలని అన్నారు. శ్రామికులు లేకుండా నగరాల అభివృద్ధి లేదని.. శ్రామికులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వారు కూడా ఆనందంగా జీవించేలా చర్యలు చేపట్టాలని పాలకులకు సూచించారు. పట్టణ కార్మికులకు ఉపాధి గ్యారంటీ చట్టం తీసుకురావాలని, నగరాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఆదాయ పన్నులో 10 శాతం కేటాయించాలని కోరారు.

ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునే విధానాలు చేపట్టాలన్నారు. భూ వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా నగరాల అభివృద్ధి వ్యూహం ఉండకూడదన్నారు. ప్రకృతిని నాశనం చేయడం ఆపి దానితో కలిసి జీవించాలన్నారు. పర్యావరణ కాలుష్యం నివారణకు 70 శాతానికిపైగా ప్రజలు ప్రజా రవాణా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం 30 శాతం ప్రజలు మాత్రమే ప్రజా రవాణాను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. పట్టణ విధానాల నిపుణులు డా. డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నగరాల అభివృద్ధి సహజంగా జరగడం లేదని, ప్రభుత్వాలు బలవంతంగా గ్రామాలను విలీనం చేస్తున్నాయని తెలిపారు. సంస్కరణల పేరుతో ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నాయని, పట్టణ విధానాలు ఎక్కడ నిర్ణయిస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకమైన విధానాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. మెట్రో రైలుపై సమీక్ష చేసిన ముఖ్యమంత్రి సామాన్యులకు అందుబాటులో ఉండే ఎంఎంటీఎస్ రైళ్లపై కూడా సమీక్షించాలని, ఆర్‌టిసి బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రాంతాల్లో తక్షణమే సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల జారీ వెంటనే ప్రారంభించాలని, నగరంలో మురికివాడల్లో సదుపాయాలు పెంచే చర్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ప్రొఫెసర్ ఇండీవర్ మాట్లాడుతూ.. నగరంలో పేదల ప్రాంతాలపై నిర్లక్ష్యం కొనసాగుతున్నదన్నారు. సంపన్నులు.. పేదల ప్రాంతాల పట్ల ద్వంద్వ విధానాలు విడనాడాలని, పేదల ఇండ్లకు హక్కులు కల్పించాలని కోరారు. ఈ సెమినార్‌లో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, ఎం.మహేందర్, కేఎన్ రాజన్న, కె.నాగలక్ష్మి, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎన్‌టిఎను రద్దు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ పరీక్షలను నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) వైఫల్యం చెందుతోందని, వెంటనే ఎన్‌టిఎను రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. విద్యార్థుల జీవితాలు గందరగోళమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్డీఏ పాలనలో ఉన్నత చదువుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు, లీకేజీలు సర్వసాధారణంగా మారాయని తెలిపారు. అత్యున్నతమైన పరీక్షలను నిర్వహించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమై విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. గతంలో మాదిరిగానే మెడికల్ అడ్మిషన్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు. ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం నీట్ రద్దును చేయాలనీ, ఈ పరీక్షను నిర్వహించే అధికారాలను తమకు అప్పజెప్పాలని కోరుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే మెడికల్ అడ్మిషన్ పరీక్షలను నిర్వహిచేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

## రూ.40 లక్షల నష్ట పరిహారమివ్వాలి

- సౌత్ గ్లాస్ కంపెనీ ప్రమాద మృతుల కుటుంబాలను ఆదుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సౌత్ గ్లాస్ ప్రయివేట్ కంపెనీలో కంప్రెషర్ పేలి ఆరుగురు కార్మికులు దుర్మరణం చెందడం, మరికొందరు గాయపడడం చాలా బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తున్నదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. తక్షణమే ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.40 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారంతా ఇతర రాష్ట్రాల వలస కార్మికులే కాబట్టి 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని సూచించారు. అన్ని కంపెనీల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని కోరారు. ఇలాంటి ఘటనలు ఈ ప్రాంతంలో అనేకసార్లు జరిగినా, అధికారులు యాజమాన్యాల ప్రలోభాలకు లొంగి తనిఖీలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. తక్షణమే ఈ ఘటనపై విచారణ జరిపి, జాగ్రత్తలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రూ.67 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

- ఎయిర్‌పోర్టులో ప్రయాణికుడి అరెస్ట్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సుమారు రూ.67లక్షల విదేశీ కరెన్సీని అధికారులు శనివారం పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి విదేశీ కరెన్సీతో వెళ్తున్న ప్రయాణికుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక ప్రయాణికుడు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్నాడు. అతని వెంట తెచ్చుకున్న బ్యాగును డీఆర్ఐ అధికారులు ఎయిర్‌పోర్టులో తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు చుట్టి తరలిస్తున్న విదేశీ కరెన్సీని అధికారులు గుర్తించారు. దాన్ని బయటకు తీసి లెక్కిస్తే రూ.67,11,250 విలువైన యూఎస్ డాలర్లు ఉన్నాయి. వెంటనే కరెన్సీని స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి ఆర్‌జిఐఎ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, అతన్ని రిమాండ్‌కు తరలించారు.

## పిసి ఘోష్ కమిషన్ గడువు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల న్యాయ విచారణ గడువును మరో రెండు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జిఒ నెంబరు 14ను జారీ చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నెలాఖరు(ఆదివారం) పీసీ ఘోష్ కమిషన్ గడువు ముగియనుంది. విచారణ ఇంకా పూర్తికాని తరుణంలో గడువును ఆగస్టు 31 వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ప్రాజెక్టుకు సంబంధించిన మాజీ ఇఎన్‌సిలు, ప్రస్తుత ఇఎన్‌సిలు, ఇతర ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను పూర్తివివరాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈనెల తొలివారంలో మాజీ జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించిన విషయం తెలిసిందే. దాదాపు 60 మంది వరకు సీల్డ్ కవర్లతో అఫిడవిట్లు దాఖలు చేశారు. అలాగే ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన మాజీ సీఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు సైతం న్యాయ కమిషన్ నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. విచారణలో భాగంగా ఘోష్ ఇప్పటివరకు సాంకేతిక పరమైన అంశాలను మాత్రమే అధ్యయనం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు చేయడం ద్వారా బ్యారేజీని కాపాడాలని ప్రభుత్వానికి సూచించారు.ఎన్‌డిఎస్ఏ సైతం సర్కారుకు మధ్యంతర నివేదిక ద్వారా సూచనలు చేసింది.దీంతో కొన్ని మరమ్మత్తులు చేయాలంటూ ఆయా నిర్మాణ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. అవి దాదాపు పూర్తయినట్టు సమాచారం. ఇంకా ఆర్థిక పరమైన అంశాలు, రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులను విచారించే అవకాశం ఉంది. ఈ మేరకు జస్టిస్ ఘోష్‌కు సహకరించేందుకు ఐదు కమిటీను సైతం ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 31 వరకు ఈ ప్రక్రియ మొత్తం పూర్తిచేసిన వారం రోజుల ముందే నివేదిక ఇచ్చే అవకాశాలు ఉన్నాయని కమిషన్ వర్గాలు తెలిపాయి.

**IN THE COURT OF THE HON'BLE MACT CUM XXVI ADDL. CHIEF JUDGE CTTY CIVIL COURT AT :: HYDERABAD**
**O.P.No. 747 of 2023**

Between:
Bejjanki Vinay Kumar Chary minor
Rep by B.Somaiah
...Petitioner
AND
Kyataramoni Ajay Kumar and Another
.. Respondents

To
1 Kyataramoni Ajay Kumar S/o K.Balaliah, Age: 22 years. Owner cum driver of car B No TS12UC 0862, R/o. 17-1.181/A/44, Singareni Colony, Saidabad, Hyderabad.
(Respondent no.1)

Whereas the above named Petitioner filed the above O.P. for Compensation U/s. 166 MV ACT against You and another and the matter is posted for appearance and counter, if any. Hence you are hereby Required to appear before this Hon'ble Court on 10.07.2024 at 10.30 A.M. either in person or through an Advocate, duty Instructed by you, failing which the matter will be decided on merits, by setting you exparte.

// By order of the Court //

M/S. S.RAVINDER REDDY
Advocate
9-13/1C, Reddy Colony,
Champapet, Hyderabad.

## దివాళా దిశగా రాష్ట్రం

- వంటేరు ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఆర్థికంగా దివాళ దిశలో వెళుతున్నదని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం రేవంత్ ఢిల్లీ చుట్టూ తిరగడం, పదవుల కోసం పాకులాడటం, పైరవీలు చేయడం, గత ప్రభుత్వంపై నిందలు వేయడం తప్ప పాలనపై దృష్టి పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.38 వేల కోట్ల అప్పులు తెచ్చి ఒక్క పథకాన్ని అమలు చేయలేదని తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతు భీమా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రతి నెలా ఆదాయం రూ.13 వేల కోట్లు రావాల్సి ఉండగా, గత నెలలో రూ.10 వేల కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందనీ, ఆంధ్రప్రదేశ్‌లో పుంజుకుందని చెప్పారు.

## బిటిపిఎస్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని భద్రాద్రి పవర్ ప్లాంట్ మొదటి యూనిట్ స్టేజ్-1లో ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి. ఏం జరిగిందో తెలియక యంత్రాంగం భయాందోళనకు గురైంది. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిఇ బిచ్చన్న ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పత్తి నిర్వహించే యూనిట్ 1, 2ను ట్రిప్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన అగ్నిమాపక దళం మంటల్ని అదుపులోకి తీసుకొచ్చింది. ట్రాన్స్‌ఫారమ్ పూర్తిగా దగ్ధమైంది. సాయంత్రం వర్షం కురవడంతోపాటు పిడుగు పడిందని, దాంతో మంటలు చెలరేగినట్టు అనుమానం వ్యక్తమవుతున్నాయి. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# విద్యారంగంలో సమూల మార్పులు

- ఆకునూరి మురళీ నేతృత్వంలో విద్యాకమిషన్
- రేవంత్ సర్కారు సమాయత్తం
- పలు సంఘాలు, సంస్థలతో కార్యాచరణ
- విస్తృత సంప్రదింపులతో కొత్త విధానం ?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని సర్కారు భావిస్తున్నది. సమూల మార్పుల ద్వారా విద్యావ్యవస్థను కొత్త పుంతలు తొక్కించేందుకు సమాయత్తమవుతున్నది. భారీ సంస్కరణలతో విద్యారంగాన్ని సమాజానికి దగ్గర చేయాలని రేవంత్ సర్కారు భావిస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే అనధికారికంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మాజీ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళిని రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్‌గా నియమించేందుకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత, ఎఐసిసి నాయకులు మాజీ ఐఎఎస్ కొప్పుల రాజు మార్గదర్శకత్వంలో విద్యారంగంలో మార్పులు చోటుచేసుకోనున్నట్టు సమాచారం. కాగా ఈ సంస్కరణలు చేసేందుకు రాష్ట్రంలోని మేధావులు, సంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, ఇతరుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించనున్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆకునూరి మురళి గత బిఆర్ఎస్ సర్కారు అనుచిత వైఖరి పట్ల రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయన ఏపి ప్రభుత్వంలో విద్యాశాఖ సలహాదారుగా పనిచేశారు. అక్కడ నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మలిచేందుకు కృషిచేశారు. నిరంతరం స్కూళ్లను పర్యవేక్షిస్తూ పాఠశాలల్లో భారీగా మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతకు పెంపొందించేందుకు ప్రయత్నించారు. ఆ తరహాలోనే కొత్త అంశాలను జోడిస్తూ తెలంగాణ పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలను చేపట్టాలనే లక్ష్యంగా విద్యా కమిషన్‌కు రూపుదిద్దనున్నట్టు తెలిసింది. కమిషన్ విధివిధానాలు ఖరారు కానప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను అందుబాటులోకి తేవడంతోపాటు ఉపాధ్యాయుల బోధనానైపుణ్యాలను సైతం బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తారని భావిస్తున్నారు. మురళి నియామకం ఉత్తర్వులు అధికారికంగా వెలువడనప్పటికీ, ఆయన ఇప్పటికే విధుల్లో చేరిపోయారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి అభిప్రాయాలు ,సలహాలు, సూచనలు సేకరించే పనిలో పడ్డారు. ఈనెల 26న హైదరాబాద్‌లో ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవితోపాటు ఇతరులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగంలో తీసుకురావాల్సిన మార్పులు గురించి చర్చించినట్టు తెలిసింది. విధానంతో పాటు సమూల మార్పులు తేవాలంటే నిధులు సైతం భారీగా అవసరమవుతాయి. వాటిని సైతం విద్యారంగానికి కేటాయించేలా కమిషన్ విధివిధానాల్లోనే పొందుపరిచేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్ అయిన ఆకునూరి మురళి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో దీర్ఘకాలం విధులు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ తన శక్తిసామర్థ్యాలను పేదల కోసం ఉపయోగపడేలా కృషిచేశారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కొత్త విద్యావిధానాన్ని రూపొందించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. మానవ జీవితం చదువుతో కీలకంగా ముడిపడి ఉన్న సంగతి తెలిసిందే. ఆ చదువు నాణ్యంగా ఉండేలా విద్యాకమిషన్ పనిచేయనుంది. ఆర్థికపరమైన అంశాలతోపాటు సామాజిక వ్యవహారాలు సమాజాన్ని ప్రభావితం చేస్తున్న విషయం విదితమే. వీటన్నింటిలోనూ చదువుదే పైచేయిగా ఉంది. ఈనేపథ్యంలో వ్యవస్థను గాడీన పెట్టడం ఈ కమిషన్ చేయాలని ఆశిస్తున్నారు. ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లోని పాఠశాలల పరిస్థితులపై అవగాహన ఉన్న మురళి... భాషకు సంబంధించిన అంశాలపై కూడా అభిప్రాయసేకరణ చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష లేకుండా మనుగడ లేదనే భౌతిక వాస్తవాన్ని అంగీకరిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని ఆ దిశగా ముందడుగు వేయించే అంశాలనూ పరిశీలిస్తున్నట్టు తెలిసింది. విద్యావ్యవస్థలో మెరుగైన ఫలితాల సాధనకు స్కూళ్ల మూసివేయడం కాకుండా తరగతి గదులను పెంచడం, ఆ మేరకు ఉపాధ్యాయుల నియామకాలు చేయడం చేయాల్సి ఉంటుంది. తద్వారా చదువు నాణ్యంగా అందడానికి వీలుంటుందని టిఎస్‌యుటిఎఫ్ నాయకత్వం సూచించినట్టు సమాచారం. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు సైతం భారీగానే కేటాయించాల్సి రావచ్చు. ప్రస్తుత రేవంత్ సర్కారు బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టిన సంగతి తెలిసిందే. కాగా 13 శాతం కేటాయించినా అద్భుత ఫలితాలు రాబట్టవచ్చనే భావనతో ఆకునూరి మురళి ఉన్నట్టు సమాచారం. సర్కారు లక్ష్యం బాగానే ఉన్నా, ఇప్పటికే నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన కేంద్రం, రేవంత్ ప్రభుత్వ తాజా విద్యా విధానాన్ని అడ్డుకుంటుందా ? లేక స్వాగతిస్తుందా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

## బొగ్గు గనుల వేలంపై నిరసనలు

- శ్రావణపల్లి బ్లాకును సింగరేణికి కేటాయించాలని డిమాండ్
- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాకుల వేలం పాటను వెంటనే ఆపేయాలని, రాష్ట్రంలోని గనులను సింగరేణి సంస్థకే నేరుగా కేటాయించాలని రెండో రోజూ నిరసనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో శనివారం సిపిఎం శ్రేణులు ధర్నాలు చేశారు. మంచిర్యాలలోని శ్రావణపల్లి బ్లాకును సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తున్నదని, అందులో సింగరేణి సంస్థ కూడా ప్రయివేటు సంస్థలతోపాటు పోటీ పడాలనడం సరైంది కాదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. సహజంగానే శ్రావణపల్లిలో సింగరేణి సంస్థనే బొగ్గు తవ్వాలన్నారు. కానీ కేంద్రం వేలంపాట ద్వారా ప్రయివేటు సంస్థలకు అవకాశం ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రం నుంచే బొగ్గు గనుల శాఖామంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగానే వేలంపాట ప్రక్రియను ప్రారంభించటం అన్యాయమన్నారు. తెలంగాణకు మణిహారంగా ఉన్న సింగరేణిని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కదలాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు.

బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. రాష్టంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, సింగరేణి ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు బొగ్గుబావుల వేలంపై పోరాటాలు చేయాలని కోరారు. వేలం పాటకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు, విద్యార్థులు, యువత, మేధావులు అందరూ ఏకతాటిగా పోరాటాలకు సిద్ధం అవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆసిఫాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

## 4 నుంచి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- 8 వరకు నిర్వహణ : టిజిపిఎస్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వచ్చేనెల నాలుగో తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. అదేనెల ఎనిమిదో తేదీ వరకు ఆ ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న టిజిపిఎస్‌సి కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చేనెల మూడో తేదీన అభ్యర్థులకు వెబ్‌ఆప్షన్ల సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. 185 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 22న టిజిపిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## విద్యార్థి నాయకులపై బిజెపి దాడికి ఎస్ఎఫ్ఐ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్‌లో విద్యార్థి నాయకులపై బిజెపి గూండాల దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ప్రవేశ పరీక్షల నిర్వహణలో వైఫల్యం, అవినీతికి పాల్పడుతున్న మోడీ ప్రభుత్వం, ప్రశ్నాపత్రాల లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి ఎంపిల క్యాంపు కార్యాలయాలను శనివారం ముట్టడించారు. ఈ పిలుపులో భాగంగా మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ క్యాంపు కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులపై బిజెపి నాయకులు కర్రలతో దాడికి పాల్పడ్డారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు తెలిపారు. విద్యార్థి నాయకులను పిడిగుద్దులు గుద్దుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భౌతిక దాడులకు పాల్పడకుండా నీట్, యూజీసీ నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రధాని మోడీని నిలదీయాలని కోరారు. పోరాడే విద్యార్థి నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం సమంజసం కాదని తెలిపారు. దాడులకు పాల్పడితే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

## కేంద్ర విద్యాసంస్థల్లో ఒబిసి విద్యార్థులకు న్యాయం చేయండి : ఐఎస్‌యు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర విద్యాసంస్థలైన ఐఐటి, ఎన్ఐటి, ట్రిపుల్‌ఐటీ, జీఎఫ్‌టిఐల్లో ఒబిసి విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యు) ఆందోళన వ్యక్తం చేసింది. ఆ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను శనివారం ఆ సంఘం జాతీయ అధ్యక్షులు పాపని నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్ గౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై అధ్యయనం చేసి ఒబిసి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానంటూ ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

## వేడుకగా అనురాగ్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం

**హైదరాబాద్ :** తెలంగాణలోని మొదట ప్రయివేటు విశ్వవిద్యాలయం అనురాగ్ యూనివర్సిటీ 1వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. శనివారం ఘట్‌కేసర్‌లోని వెంకటాపూర్‌లోని యూనివర్సిటీ క్యాంపస్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఎఎండి ఇండియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చురివాలా, యాక్సెంచర్ బిజినెస్ గ్రూప్ లీడ్ అతుల్ అభ్యంకర్ కాన్వకేషన్ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గూడా నికిత, జంగా మోనిక, దేవీనా నాయర్, పగిడోజు శివాని, బండారు భావన సిఎస్ఇలో మొదటి ఐదుగురు విద్యార్థులకు ముఖ్య అతిథులు కాన్వొకేషన్ సర్టిఫికేట్‌ను బహుకరించారు. బీటెక్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌కు చెందిన ముళ్లపాటి సాకేత్‌రెడ్డికి, బి ఫార్మసీలో ఎన్.ఆకాంక్షకు బంగారు పతకాలను, రూ.20000 నగదు బహుమతిని పల్లా రాఘవ రెడ్డి అందజేశారు.

## సింక్రోనీ 'ప్రైడ్' ఉత్సవాలు

**హైదరాబాద్ :** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీ ప్రైడ్ మంత్ 2024ను నిర్వహించినట్లు తెలిపింది. సమానత్వం, వైవిధ్యతను పెంచే లక్ష్యంతో ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఇందుకోసం మొబ్బెరా ఫౌండేషన్‌తో భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు తెలిపింది. ఈ ర్యాలీలో హైదరాబాద్‌లోని యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సహా 350 మందికి పైగా మద్దతుదారులు పాల్గొన్నారని తెలిపింది.

# ప్రమాదాలు జరిగితే తప్ప పట్టించుకోరా?

- సౌత్ గ్లాస్ కంపెనీ యజమానిని అరెస్టు చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- పరిశ్రమ సందర్శన, బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల యాజమాన్యాలు కార్మిక చట్టాలను నీరు గారుస్తూ, కార్మికులతో పన్నెండు గంటల పని చేయించుకుంటూ చాలీచాలని వేతనాలిస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమను సిఐటియు బృందం శనివారం సందర్శించింది. ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితేనే తప్పా అధికార యంత్రాంగం ఆ వైపు చూడటం లేదన్నారు. పరిశ్రమలకు అనుమతి ఇచ్చినప్పుడే అన్నీ చూసుకుని ఇవ్వాలని, నామమాత్రంగా అధికార యంత్రాంగం తనిఖీలు చేయడం సరైంది కాదని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు నిమిత్తం వచ్చిన వారితో 12 గంటలకు రూ.300, రూ.400 రోజువారీ కూలికి పని చేయించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారు ఐదుగురు కార్మికులే అంటున్నారు కానీ.. ఇంకా లోపల మృతదేహాలున్నాయని తోటి కార్మికులు చెబుతున్నారని అన్నారు. ఈ విషయంపై నిజా నిర్ధారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కార్మిక చట్టాలను కఠినంగా అమలు పరచాలని కోరారు. కంపెనీ యజమాని శైలేష్‌కుమార్ గుప్తాని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. అంగ వైకల్యం పొందిన కార్మికులకు రూ.25 లక్షలు, చికిత్స పొందుతున్న కార్మికులకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని అన్నారు. అందరూ అంతర్రాష్ట్ర వలస కార్మికులే కాబట్టి 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు సరైన తనిఖీలు చేయడం లేదని, యాజమాన్యాల ప్రలోభాలకు లొంగి చూసీచూడనట్టు ఉండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ డిపార్ట్‌మెంట్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లేదంటే సిఐటియు దశలవారీ ఉద్యమ కార్యాచరణ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు బిసా సాయిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, జిల్లా కోశాధికారి కవిత, నాట్కో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి కిరియా నాయక్, నాయకులు శ్రీకాంత్, అశోక్, ఈశ్వర్‌నాయక్, చంద్రమౌళి, కావలి రాజు, బేరి శ్రీనివాస్, మైలారం జంగయ్య తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న నేతలు

## వ్యక్తి దారుణ హత్య

- గొంతు కోసి చంపిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు కత్తితో అతని గొంతు కోసి హతమార్చారు. ఈ ఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండలోని చోటాబజార్ ఏరియాకి చెందిన ఇజాయత్ అలీ (31) సౌదీలో ఇంజనీర్‌గా పని చేశారు. కొన్నేళ్ల కిందట ఆయన ఇండియాకు వచ్చారు. శనివారం గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అతన్ని క్వాలీస్ వ్యాన్‌లో మంచిరేవుల గ్రీన్ ల్యాండ్స్ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకొచ్చారు. అక్కడ కత్తితో ఇజాయత్ అలీ గొంతు కోసి హత్య చేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందాలను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. ఘటన స్థలంతో క్వాలీస్ వ్యాన్‌తోపాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్యలో ఇద్దరు యువకులతోపాటు ఓ మహిళ కూడా పాల్గొన్నట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

## గిరిజనుల అభివృద్ధికి మరిన్ని నిధులు

- సంక్షేమంపై జాతీయ గిరిజన కమిషన్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ మరింత పురోగతిలో ముందుకు సాగాలని జాతీయ గిరిజన కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ ది ప్లాజాలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్, ఆయా శాఖల అధికారులు తమ విభాగాల్లో చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల పురోగతిని కమిషన్‌కు వివరించారు. గిరిజన సంక్షేమ శాఖలోని విద్య, మౌలిక వసతుల కల్పన, ట్రైకార్, జిసిసి, సంస్కృతి తదితర విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న ఆయా పథకాల పురోగతిని గురించి హుస్సేన్ ఈ సందర్భంగా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత పట్టుదలతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో గురుకులం కార్యదర్శి సీతాలక్ష్మి, గిరిజన శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, ట్రైకార్ జీఎం శంకర్, జీసీసీ జీఎం సీతారాం, గిరిజన పరిశోధన సంస్థ సంయుక్త సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల, డాక్టర్ డీ. సత్యనారాయణ తదితర ఉన్నతాధికారులు, పలు గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చేప పిల్లలేవి..?

- సీజన్ సమీపిస్తున్నా ఇంకా పిలవని టెండరు.. మత్స్యకారుల్లో ఆందోళన
- చేప పిల్లల సేకరణకు రెండు నెలల సమయం
- రాష్ట్రంలో గతేడాది 86.5 కోట్ల చేప పిల్లల పంపిణీ
- ఉచిత పిల్లల పంపిణీతో ఆదాయం, ఉపాధిని కల్పిస్తున్న చేపల పెంపకం
- ప్రభుత్వం సాయం చేయాలని మత్స్యకారుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదాయం, ఉపాధిని కల్పిస్తూ శరవేగంగా అభివృద్ధి చెందిన మత్స్య పరిశ్రమకు సర్కార్ సాయం ఎంతైనా అవసరం. వేలాది మత్స్య సొసైటీల్లో లక్షలాది మంది వృత్తిదారులు జీవనోపాధి పొందుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నీటి వనరులు పెరగడంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఉచిత పిల్లల పంపిణీ వల్ల చేపల పెంపకం లాభసాటిగా మారింది. కానీ ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోకపోవడం మత్స్యకారుల్లో గందరగోళానికి తెరలేపింది. చేప పిల్లలను వదిలే సమయం సమీపిస్తున్నా టెండర్లు పిలవకపోవడంతో వృత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. ఉచిత పిల్లలు కాకపోయినా సొసైటీలకు సర్కార్ నేరుగా ఆర్థిక సహాయం అందించాలని వృత్తిదారులు కోరుతున్నారు. రాష్ట్రంలో 23,748 నీటి వనరుల్లో చేపలు పెంచుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 4.5 లక్షల టన్నుల వరకు ఏటా చేపల ఉత్పత్తి జరుగుతోంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ఇది మరింత లాభసాటిగా మారుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5112 మత్స్య సంఘాలేర్పడగా వీటిల్లో సుమారు నాలుగు లక్షల మంది వృత్తిదారులున్నారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకమ్మ సాగర్‌కు నీటిలభ్యత బాగానే ఉంది. సంగారెడ్డి జిల్లాలో సింగూరు జలాశయం, మెదక్ జిల్లాలో నవదుర్గ వంటి ప్రాజెక్టుల అభివృద్ధితో వేల సంఖ్యలో చెరువులు, కుంటలు, వాగులు ఇతర నీటి వనరులకు నీటి లభ్యత పెరిగింది. వీటిల్లో మత్స్యకారులు చేపలను పెంచుకుని జీవనోపాధి పొందుతున్నారు. నీటి వనరులు పెరిగినందున ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సంఖ్య పెరిగింది. 642 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా, 50 వేల మంది వరకు వృత్తిదారులు సభ్యులుగా ఉన్నారు. ఏటా 60 వేల టన్నుల వరకు చేపల ఉత్పత్తి జరుగుతుంది. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం చేప పిల్లల పంపిణీపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

### గతేడాది 86.5 కోట్ల చేప పిల్లల పంపిణీ

గతేడాది ఇదే సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని సుమారు 5112 మత్స్య సొసైటీలకు రూ. 82 కోట్ల వ్యయంతో 77 కోట్ల బొచ్చ, రవ్వ, బంగారుతీగ వంటి రకాల చేప పిల్లల్ని అందజేశారు. లాభసాటిగా ఉండేందుకు రూ.22 కోట్లతో 9.5 కోట్ల రొయ్య పిల్లల్ని కూడా పంపిణీ చేశారు. మొత్తం రూ.104 కోట్ల వ్యయంతో 86.5 కోట్ల చేప పిల్లలను మత్స్య సంఘాలకు పంపిణీ చేసి చెరువుల్లో వదిలారు.

### నేరుగా ఆర్థిక సాయం..?

చేప పిల్లల పంపిణీ కోసం ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా టెండర్లు పిలిచేది. గతేడాది ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి జూన్ వరకు ఖరారు చేసి చేప పిల్లల సరఫరాకు ఆదేశాలిచ్చింది. జూన్, జులై మాసాల్లో వర్షాలు పడి చెరువులు నిండినందున చేప పిల్లలను పంపిణీ చేశారు. చేప పిల్లలను ఉత్పత్తి కేంద్రాల నుంచి సేకరించి సొసైటీలకు అప్పజెప్పి చెరువుల్లో వదిలేందుకు కనీసం రెండు నెలల సమయమన్నా పడుతుంది. ప్రస్తుతం జూన్ మాసం పూర్తి కావస్తున్న ఇంకా టెండర్లు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని భావించట్లేదని అధికారులు చెబుతున్నారు. నేరుగా మత్స్యకారులకే ఆర్థిక సహాయం అందించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

### ముంచుకొస్తున్న సీజన్.. కురుస్తున్న వర్షాలు

ఈ ఏడాది నైరుతి ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున జూన్, జులైలో చేప పిల్లలను వదిలితే మంచి సైజు పెరుగుతాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికే వానాకాలం వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌లో సంగారెడ్డి జిల్లాలో సాధారణ వర్షాపాతం 58.4 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటికే 93.6 మి.మీ వర్షం పడింది. మెదక్‌లోనూ 61.5 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇప్పటికే 77.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 55.0 సాధారణ వర్షపాతం కాగా ఇప్పటికే 56.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దాంతో చెరువుల్లో నీటి మట్టం పెరుగుతుంది. జులై వరకు చేప పిల్లలను వదిలితే ఉత్పత్తి ఆశించిన మేరకు వస్తదని వృత్తిదారులు అంటున్నారు.

### చేప పిల్లల పెంపకానికి ఆరు నెలల కాలం

చేపలు కనీసం కిలో సైజు పెరగాలన్నా ఆరు నెలల సమయమైనా పడుతుంది. 40 రోజుల వయసున్న 35-40 ఎంఎం సైజు చేప పిల్లలు, లేదంటే 75 రోజుల వయసున్న పెద్ద సైజు పిల్లలు (80-100 ఎంఎం) సరఫరా చేసేది. వాటిని పెంచితేనే ఆరు నెలలు పట్టేది. ఇప్పుడు ఆలస్యమైతే అంతకంటే ఎక్కువ సైజు పిల్లల్ని చెరువుల్లో పోసుకోవాల్సి వస్తది. అందుకు పిల్లల ధర భారం కూడా పెరుగుతుందని పెంపకందార్లు అభిప్రాయపడుతున్నారు. కనీసం జూన్, జులై, ఆగస్టు నెలల్లో చేప పిల్లలను చెరువుల్లో వదిలితే అవి పెరిగాక జనవరి నుంచి మార్చి వరకు చేపలను పట్టుకునేందుకు వీలుంటుందని, ఆలస్యమైతే ఎండల తీవ్రత వల్ల చేపలు చనిపోతాయని మత్స్యకారులు అంటున్నారు.